సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వాసుపల్లికి గౌరీ సేవా సంఘం మద్దతు



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు అల్లిపురంలోని శ్రీ గౌరీ (గవర) సేవా సంఘం మద్దతు తెలిపింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్రి శ్రీనివాసరావు, పెంటకోట రాజు అధ్యక్షతన బుధవారం సాయంత్రం సంఘ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో వాసుపల్లి మాట్లాడుతూ గవర కులస్తులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారికి సముచిత సీఎం జగన్ ప్రాధాన్యత కలిప్పించారన్నారు. వెంకటేశ్వరమెట్ట సమస్య పరిష్కారం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. జగనన్న ప్రభుత్వం మరలా అధికారం చేపట్టగానే వెంకటేశ్వరమెట్ట సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామన్నారు. తనకు అండగా గవర్లందరూ నిలిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త పీల వెంకట అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, గౌరీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డెకరేషన్ సామగ్రి దగ్ధం



వ్యాపిస్తున్న మంటలు

జగదాంబ : జీవీఎంసీ 39వ వార్డులోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగి డెకరేషన్ సామాన్లు దగ్ధమయ్యాయి. ఏడుకొండలు అనే వ్యక్తి లక్ష్మీ టాకీస్ దరి సాగర్‌దుర్గా గుడి సమీపంలో నివాసం ఉంటున్నారు. రెండంతస్తులు భవనంలోని మొదటి అంతస్తులో అతను నివసిస్తూ పై అంతస్తులో డెకరేషన్ సామాన్లు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. బుధవారం సాయంత్రం సామగ్రి ఉన్న రేకుల షెడ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న వ్యక్తులు అది గమనించి అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు హుటాహుటిన వచ్చి మంటలార్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే డెకరేషన్ సామగ్రి మొత్తం కాలిపోవడంతో రూ. 10 నుంచి రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు.

వాసుపల్లి పరామర్శ..

అగ్ని ప్రమాదం గురించి తెలుసుకున్న దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. బాధితుడిని పరామర్శించి నష్టంపై కలెక్టర్‌తో మాట్లాడి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణలో జోక్యం చేసుకోండి

- కలెక్టర్‌కు 'ఉక్కు' సీఎండీ లేఖ

ఉక్కునగరం: సంక్షోభంలో ఉన్న స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ బ్యాటరీల రక్షణ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలని కలెక్టర్‌ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మరోసారి లేఖ రాశారు. కన్వేయర్ బెల్ట్ ద్వారా గాని, వేరే పద్ధతిలో గాని స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు అమలుకు నోచుకోకపోవడం చాలా ఆందోళనకరంగా ఉందన్నారు. పోర్టు యాజమాన్యం అక్కడి ఉద్యోగులతో చర్చలు పురోగతిలో ఉన్నాయని చెబుతూనే బొగ్గు రవాణాకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్ల ఉత్పత్తి తీవ్రంగా తగ్గిందని చెప్పారు. తమ సొంత లోడర్లు, డంపర్ల ద్వారా బొగ్గును శాంతియుతంగా తరలించడానికి అవసరమైన భద్రతను అందించాలని జిల్లా పరిపాలన వ్యవస్థను, పోలీసులను లేఖలో సీఎండీ అభ్యర్థించారు.


సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
✆ 7997958342, 9912440606

ఘాట్‌రోడ్డుకు.. గ్రీన్ సిగ్నల్

డెవలప్‌మెంట్ వాచ్

- జోరుగా ఇసుకకొండ సత్యనారాయణస్వామి ఆలయ ఘాట్ రోడ్డు పనులు
- రూ.11 కోట్ల నిధుల కేటాయింపు



ఇసుకకొండపై వెలసిన సత్యనారాయణస్వామి ఆలయం



పూర్ణామార్కెట్ నుంచి సత్యదేవుని ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు

దాబాగార్డెన్స్ : సత్యదేవుని భక్తుల దశాబ్దాల నాటి కల నెరవేరనుంది. పదేళ్ల కిందట నిర్మాణం చేపట్టిన ఘాట్ రోడ్డు పనులు అనివార్య కారణాల వల్ల నిలిచిపోయాయి. ఇసుకకొండ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నిత్యం భక్తులు వస్తుంటారు. వరుసగా ఐదు పౌర్ణమిలు దేవస్థానంలో స్వామిని దర్శనం చేసుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. విశాఖ జిల్లా నుంచే కాక పరిసర ప్రాంతాల నుండి కూడా భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు కేజీహెచ్ మార్చురీ మీదుగా రావల్సిన పరిస్థితి ఉంది. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే ఇసుకకొండ సత్యనారాయణస్వామి ఆలయ ఘాట్‌రోడ్డు పనులు పూర్తి చేసేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దాదాపు ఘాట్‌రోడ్డు పనులు పూర్తి కావస్తున్న సమయంలో కోర్టు తగాదాలతో ఆ పనులు కాస్త నిలిచిపోయాయి. అయితే ఇటీవల ఈ పనుల పూర్తికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో రూ.11 కోట్లతో పూర్తి చేయనున్న ఘాట్ నిర్మాణానికి అడ్డంకి తొలగిపోయింది. దీంతో 36వ వార్డు కార్పొరేటర్ మేరీజోన్స్ పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.



ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేరీ జోన్స్



అనివార్య కారణాల వల్ల కొంత కాలం క్రితం నిలిచిపోయిన పనులు



సమస్య పరిష్కారమై ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం అడ్డంగా ఉన్న కట్టడాలను తొలగించిన దృశ్యం

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు, కుంకుమలతో అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఈవో రమాబాయి, అర్చకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

దాబాగార్డెన్స్: జోన్–3 పరిధిలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున గురువారం పలు వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనగర్ వెజిటబుల్ మార్కెట్ వద్ద టీఎస్సార్ నుంచి బ్లాక్–6, 7 రిజర్వాయర్‌కు తాగునీరు సరఫరా చేసే 600 ఎంఎం డయా జీఆర్‌పీ పంపింగ్ ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల నిమిత్తం జీవీఎంసీ మంచి నీటి సరఫరా విభాగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నీటి సరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా సంబంధిత ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తుందని, ఆయా ప్రాంతాల వాసులు సహకరించాలని కోరారు.

అంతరాయం కలిగే ప్రాంతాలు..

కేఆర్ఎం కాలనీ, శివాలయం ఏరియా, న్యూ రేసపువానిపాలెం, పిఠాపురం కాలనీ, పిఠాపురం, శివాజీపాలెం, మద్దిలపాలెం, ఆర్టీసీ డిపో రోడ్డు, గాయత్రి స్కూల్ రోడ్డు, పెద్ద నుయ్యి ఏరియా, చైతన్యనగర్‌లో నీటి సరఫరా జరగదన్నారు.

రెడ్‌క్రాస్‌లో తలసేమియా దినోత్సవం



చిన్నారులతో రెడ్ క్రాస్ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు

మహారాణిపేట : వరల్డ్ రెడ్ క్రాస్ డే, ఇంటర్నేషనల్ తలసేమియా డేలను పురస్కరించుకుని మహారాణిపేటలో గల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ శాఖ వద్ద రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరిగాయి. రెడ్ క్రాస్ ఫౌండర్ హెన్రీ డ్యూనంట్ జన్మదినోత్సవం సందర్భంగా జరిగే రెడ్ క్రాస్ డేలో భాగంగా పతాకావిష్కరణ, హెన్రీ డ్యూనంట్‌కి నివాళులు అర్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై. శివనాగేందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ విక్రాంత హనుమంతు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అమోఘం అన్నారు. తమ ఫౌండేషన్ తరఫున తలసేమియా చిన్నారులకు సహకారాన్ని అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. అదే విధంగా గెయిల్ ఇండియా సీజీఎం ఎల్ఎస్ రావు మాట్లాడుతూ విశాఖపట్నం రెడ్ క్రాస్ వారు తలసేమియా సెంటర్ ద్వారా చిన్నారులకు పూర్తి ఉచితంగా రక్త మార్పిడి ప్రక్రియ చేయడం అద్భుతమన్నారు. ఇంతటి భయంకరమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు మనోధైర్యం కలగాలని, తలసేమియా చిన్నారులు చదువులో కూడా ఉన్నతంగా రాణించాలన్నారు. ఈ చిన్నారులకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందన్నారు. రెడ్ క్రాస్ సంస్థ నడుపుతున్న తలసేమియా సెంటర్‌లో రక్త మార్పిడి చేసుకున్న చిన్నారులకు సంగీతం, నృత్యం, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ ఎండీ రెహ్మాతుల్లా, అరుణ జ్యోతి, సెక్రటరీ పి. రవికుమార్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ఎం. ప్రవల్లిక, ఎస్‌కేఎల్ రావు, మురళి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు రాతలు కలచివేశాయి

- విరాళం ఇస్తే నిందలేస్తారా?
- ఎరుకుమాంబ అమ్మవారి భక్తురాలి ఆవేదన



మాట్లాడుతున్న భక్తురాలు సంగీత, ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : తప్పుడు రాతలు కలచివేశాయని శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి భక్తురాలు సంగీత ఆవేదన వ్యక్తం చేశారు. దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారిని గత 15 ఏళ్ల నుంచి నమ్మి పూజిస్తున్నానని, చాలా కాలం పిల్లలు లేని తనకు అమ్మవారి మహత్యంతో పిల్లలు కలిగినట్లు తెలిపారు. ఈ దశలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసి రూ. లక్షా 17 వేలు ఇచ్చానన్నారు. అలాగే ఆలయ పెయింటింగ్‌కు మరో రూ. లక్ష, ఇతర పనులకు మొత్తంగా రూ. 3.50 లక్షలు ఇచ్చినట్లు సంగీత తెలిపారు. అయితే మంగళవారం ఈనాడు దినపత్రికలో 'విరాళాల పేరిట అనధికార వసూళ్లు' శీర్షికన వచ్చిన వార్త తనను ఆవేదనకు లోను చేసిందన్నారు. తాను ఆలయానికి ఖర్చు చేసిన దాంట్లో ఆలయ చైర్మన్, ఈవోకు ఎటువంటి సంబంధం లేదని, తమకు అమ్మవారి మీదున్న నమ్మకంతో తమ వంతుగా ఖర్చు చేసినట్లు ఆమె తెలిపారు. ఆ ఖర్చులకు సంబంధించి తన వద్ద బిల్లులు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కొంత మంది రాజకీయంగా ఆలయంపై తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. దేవదాయ శాఖ అనుమతులతోనే భక్తులు విరాళాలు ఇస్తున్నారన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆవేదన కలిగిస్తాయన్నారు.

సింహగిరి.. భక్త ఝరి



పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- గంధం అమావాస్యకు పోటెత్తిన భక్తులు
- అప్పన్న ప్రతిరూపాలుగా కోలలకు పూజలు

సింహాచలం: గంధం అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంత భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రికే సింహాచలం చేరుకున్న వీరంతా బుధవాం తెల్లవారుజామున కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలను పుష్కరిణి గట్టుపై ఉంచి పూజలు చేశారు. వంటలు వండి కోలలకు ఆరగింపు చేశారు. అమృత కలశాలు, పండ్లు సమర్పించారు. కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. మెట్లమార్గం ద్వారా సింహగిరి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. గరిడీ నృత్యాలు చేస్తూ స్వామిని కీర్తించారు. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న మార్గం భక్తజన సంద్రంగా మారింది. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పుష్కరిణి వద్ద గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం గార్డులు బందోబస్తు నిర్వహించారు.

ప్రచార పర్వం



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బోర విజయలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బోర శ్రీనివాసరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



32వ వార్డులో శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె. అనూష పట్నాయక్ వార్డు నాయకుడు మూలే రామిరెడ్డి, ఎస్‌కే మహంతి, శిష్టకరణ సంఘీయులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు.



జీవీఎంసీ 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణా మార్కెట్, పండా వీధి, ఆయిల్ మిల్లు సందు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



27వవార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వాసుపల్లి కుమారుడు వాసుపల్లి సాకేత్ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పద్మనాభం అమ్మాజీ, విశాఖ ఐటీ కార్యదర్శి అజయ్‌రెడ్డి, ప్రచార కమిటీ సభ్యుడు మధురెడ్డి, చిట్టిపోయిన శివ, పంది ఎల్లారెడ్డి, జీరు గురుమూర్తిరెడ్డి, అనిల్ కుమార్, వీటీ కృష్ణకుమార్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

– దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ/సీతమ్మధార

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వాసుపల్లిని సత్కరిస్తున్న రాజస్థానీ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం : జీవీఎంసీ 35వ వార్డుకు చెందిన శ్రీ సంపత్ కనక సాయి సంఘం ప్రతినిధులు 50 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు డి.కొండలరావు, బి.సత్య, వి.గంగాధర్, ఎం.సత్తిబాబు, బి.వెంకటరావు, బి.వేణు, బుచ్చిరాజు, ఎస్.ప్రకాష్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

వాసుపల్లికి రాజస్థానీ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల మద్దతు..

దాబాగార్డెన్స్ : నిరంతర ప్రజా సేవకుడు, అందరివాడు వాసుపల్లి గణేష్‌కుమార్ అని రాజస్థానీ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గీత్ సంగీత్ థియేటర్ వద్ద ఓ హోటల్లో బుధవారం రాత్రి వాసుపల్లికి మద్దతుగా సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజస్థానీ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాసుపల్లి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శంకర్‌లాల్ శర్మ, మనోజ్ దుగ్గడ్, నిరంజన్ సుమని తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన 100 కుటుంబాలు..

జీవీఎంసీ 37వ వార్డు పెయిందొరపేట షెడ్యూల్ కులానికి చెందిన 100 కుటుంబాలు వాసుపల్లి సమక్షంలో పార్టీలో చేరాయి. ఏపీ టూరిజం డైరెక్టర్ రేవతి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బూర రవి, నేతల సుధ, యడ్ల మురళి, గంటల బాబు, బి. ప్రశాంత్, కె. శివ తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి వెలమ కులస్తుల మద్దతు..

జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురానికి చెందిన 60 వెలమ కుటంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ ఆధ్వర్యంలో బోదల కిషోర్, గుడివాడ సునిల్, జె. కరుణాకర్, బి. చిన్ని, ఎ. రెడ్డి, హరీష్, రాజశేఖర్ చేరారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ నాయకుడు వేలంగినిరావు పాల్గొన్నారు.



శ్రీ సంపత్ కనకసాయి సంఘం ప్రతినిధులతో వాసుపల్లి



పార్టీలో చేరిన 37వ వార్డు స్థానికులతో వాసుపల్లి గణేష్‌కుమార్



పార్టీలో చేరిన వెలమ కుటుంబాలతో వాసుపల్లి

శేషేంద్రుడు యుగకవి

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో 'యుగీన శ్వాసల కవీంద్రుడు శేషేంద్రుడు' అనే అంశంపై సాహితీ ప్రసంగ కార్యక్రమం జరిగింది. కవి, ముఖ్య వక్త వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు (కాకినాడ) మాట్లాడుతూ ప్రముఖ తెలుగు కవి శేషేంద్ర తన కవిత్వంలో ఆధునిక భావజాలం, సంప్రదాయ కవిత్వం సమ్మిళితంగా అనేక రచనలు చేసి ముందు తరాలకు అందించారన్నారు. ముఖ్యంగా రామాయణ షోడసి, స్వర్ణహంస, ఋతుఘోష కావ్యాలు తెలుగు సాహిత్యంలో తరతరాలకు నిలిచే సాహిత్య సంపదలని ప్రశంసించారు. రచయితలు కె.జి. వేణు, కేశనాపల్లి రాంప్రసాద్, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు నుంచి బొగ్గు రవాణాకు అంగీకరించండి

ఉక్కునగరం: గంగవరం పోర్టులో ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన బొగ్గును ప్లాంట్‌కు రవాణా చేయడానికి అంగీకరించాలని గంగవరం పోర్టు కార్మిక సంఘాల నాయకులను ఉక్కు పరిశ్రమ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. గత నెల 12 నుంచి గంగవరం పోర్టులో తలెత్తిన కార్మిక వివాదం వల్ల స్టీల్‌ప్లాంట్‌కు చెందిన లక్షల టన్నుల బొగ్గు, ఇతర ముడిపదార్థాల రవాణా నిలిచిపోయింది. బొగ్గు కొరత వల్ల స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ బ్యాటరీల పరిస్థితి అత్యంత క్లిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు బుధవారం ప్లాంట్ నుంచి ర్యాలీగా గంగవరం పోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఉన్న గంగవరం పోర్టు నాయకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గంగవరం పోర్టు కార్మికులకు తమ నుంచి పూర్తి మద్దతు ఇస్తామన్నారు. ప్రస్తుత ప్లాంట్ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తమ బొగ్గును రవాణాకు అనుమతించాలని చేతులెత్తి నమస్కరించి విజ్ఞప్తి చేశారు. దీనిపై గంగవరం పోర్టు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు తాము వ్యతిరేకం కాదని, తమకు జిల్లా యంత్రాంగం నుంచి స్పష్టమైన హామీ లభించాలన్నారు. దీంతో సమస్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు ఎ.కె.సోబ్తీ, జి.గాంధీ, జీఎం ఎన్.భాను, పలువురు ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.